క్లుప్తంగా

విశ్వంలో ఉచిత సైనిక్ మోడల్ టెస్ట్ రేపు

తిరుపతి ఎడ్యుకేషన్: నగరంలోని వరదరాజనగర్‌లో ఉన్న విశ్వం విద్యాసంస్థలో ఈ నెల 26వ తేదీన సైనిక్ మోడల్ టెస్ట్‌ను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన సైనిక్ విద్యాసంస్థల్లో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అనుగుణంగా మోడల్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సబ్జెక్టు పరంగా లోపాలను సరిదిద్దుకుని అసలైన పరీక్షకు సంసిద్ధం కావడానికి ఈ మోడల్ టెస్ట్ దోహదపడుతుందని తెలిపారు. ఈ ఉచిత మోడల్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్(అడ్మిట్ కార్డు) జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: ముక్కంటి బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వడానికి ఆసక్తి ఉన్న కళా బృందాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ కేఎస్ రామారావు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మార్చి 3 నుంచి 16వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయన్నారు. ఆ సమయంలో దూర్జటి కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నా రు. ఆసక్తి గల కళాకారులు ఫిబ్రవరి 15లోపు ఆల య కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

చెరువులో బాలిక మృతదేహం

చిట్టమూరు : చిట్టమూరు గిరిజన కాలనీ సమీపంలోని చెరువులో గుర్తుతెలియని బాలిక (సుమారు 8) మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు వాకాడు సర్కిల్ పరిధిలో చిన్నారుల మిస్సింగ్ కేసులపై ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వాగతం








రేణిగుంట విమానాశ్రయంలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, మేయర్ శిరీష, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత

వైఎస్సార్‌సీపీ నేతలపై కేసు నమోదు

- అనధికార ఫ్లెక్సీల ఎఫెక్ట్

తిరుపతి రూరల్: కొందరు అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు చంద్రగిరి, తిరుపతి రూరల్, పాకాల తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తున్నారు. వాటిని ఆకతాయిలు చించడం, కాలి్చవేయడం వంటి రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నారు. దీంతో పచ్చని పల్లెల్లో విద్వేషాలు రేగుతున్నాయి. ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అందుకే అధికారులు ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారు. అంతేగాక ఫ్లెక్సీ రహిత చంద్రగిరిగా తీర్చిదిద్దేందుకు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అనే తేడా లేకుండా అనధికార ఫ్లెక్సీలు, కరపత్రాలు, హోర్డింగులు ఏర్పాటు చేస్తున్న వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై కేసు నమోదు

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి రెండు రోజులుగా తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపడుతున్నారు. ఈ క్రమంలో సర్పంచ్ లక్ష్మి భర్త శివ, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు గురవారెడ్డి, ఎంపీటీసీ జయకర్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అనుమతి తీసుకోకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ బుధవారం తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటుచేయడంతోపాటు కరపత్రాలను అంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి రూరల్ ఎంపీడీవో రమేష్‌బాబు హెచ్చరించారు.



తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గాంధీపురం పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ

తిరుపతి జిల్లాలో ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: తిరుపతి జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలువురిని ఇతర జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు, వై. శ్రీనివాసరావు, వీరనారాయణ, ఆదిలక్ష్మిని గుంటూరు జిల్లాకు, పులిరావు, గోపాల్‌ను పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. అలాగే గుంటూరు జిల్లాలో పని చేస్తున్న కొల్లరామిరెడ్డి, చౌదయ్య, జగన్‌మోహన్ రావు, శ్రీహరిబాబు, జెత్తయ్య నాయక్ తిరుపతి జిల్లాకు బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

రామకృష్ణ తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

తిరుమల: తిరుమలలో గురువారం జరగనున్న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటికి టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో మాడ వీధుల గుండా పూలు, పండ్లు, స్వామివారి ప్రసాదాలు తదితర పూజా సామగ్రిని శ్రీరామకృష్ణ తీర్థానికి తీసుకెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు. అధికబరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, వృద్ధుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అటవీ మార్గంలో ఈ తీర్థానికి నడిచి వెళ్లడానికి అనుమతి లేదని అధికారులు తెలిపారు. అలాగే గోగర్భం డ్యామ్ పాయింట్ నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ దాదాపు 35 బస్సులను ఏర్పాటు చేసింది. గురువారం ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే యాత్రికులను ఈ తీర్థానికి అనుమతిస్తారు. యాత్రికులకు టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాలు, కాఫీ, పొంగళి, ఉప్మా, సాంబారు అన్నం, పెరుగన్నం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఉమామహేశ్వరికి డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎకనామిక్స్ విభాగం విద్యార్థిని ఉమామహేశ్వరికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె ప్రొఫెసర్ కె.పంతనకుమారి ఆధ్వర్యంలో ఏస్టడీ ఆఫ్ మైక్రో ఫైనాన్షియల్ సర్వీసెస్ టు ది రూరల్ పూర్ త్రో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ అనే అంశంపై పరిశోధన చేశారు.

ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకోవడం సరికాదు

తిరుపతి(అలిపిరి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అయోధ్యలో చిన్న పనిచేసి గొప్పలు చెప్పుకోవడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు చింతా మోహన్ తెలిపారు. ఆయన బుధవారం మార్పు కావాలి–కాంగ్రెస్ రావాలి కార్యక్రమం నిర్వహించారు. తిరుపతిలో ఈ నెల 28న కాంగ్రెస్ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

అంజమ్మకు నివాళి



అంజమ్మకు నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

పాకాల: మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి తల్లి జెట్టిగుండ్ల అంజమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం పాకాల మండలం సామిరెడ్డిపల్లెకు చేరుకున్నారు. అంజమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జనార్ధన్ రెడ్డిని పరామర్శించారు. అంజమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

వేదాంతపురంలో రూ.10 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు

తిరుపతి రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా నివారించేందుకు వేదాంతపురంలో ముందస్తుగా ముమ్మర చర్యలు చేపడుతున్నారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడి సహకారంతో రూ.10 లక్షల తుడా నిధులతో వేదాంతపురం ఆర్చ్ నుంచి రాందాస్ కాలనీ వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. పనులను బుధవారం సర్పంచ్ చెరుకుల జనార్ధన్‌యాదవ్, ఎంపీటీసీ చెరుకుల కృష్ణవేణి ప్రారంభించారు. సర్పంచ్ జనార్ధన్‌యాదవ్ మాట్లాడుతూ పంచాయతీలో తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉందని, సహకరించాలని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అడిగామన్నారు. వెంటనే ఆయన రూ.10 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించడమే కాకుండా కాలనీల్లో అవసరమైన చోట సీసీ రోడ్లను సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈవోపీఆర్డీ గిరిధర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ చెరుకుల జనార్ధన్‌యాదవ్

ఎమ్మెల్యే పెళ్లికానుక పంపిణీ

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరు గ్రామంలో త్వరలో వివాహం చేసుకోనున్న వరుడు ముబారక్‌కు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధమునిరెడ్డి, నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఢిల్లీబాషా వరుడి తల్లిదండ్రులకు అందజేశారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తమ సొంత నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలో వివాహం చేసుకోబోతున్న వధూవరులకు నల్లపూసలు, వెండి మెట్టెలు, వధూవరులకు బట్టలు, స్వీట్ బాక్సు, గ్రీటింగ్ కార్డు అందజేస్తున్న విషయం తెలిసిందే.



వరుడి తల్లిదండ్రులకు పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని బుధవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, తెలంగాణ తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.



మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్

మంత్రి రోజాపై కౌన్సిలర్ ఆరోపణలు అవాస్తవం

తిరుపతి కల్చరల్: మున్సిపల్ చైర్మన్ పదవి కోసం మంత్రి ఆర్కే రోజా రూ.లక్షలు తీసుకున్నారని కౌన్సిలర్ భువనేశ్వరి చేసిన ఆరోపణలు అవాస్తవమని, దీన్ని తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా, సీఎం జగనన్న ఆశయాలకు అనుగుణంగా కులమతాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఓసీ రిజర్వేషన్ స్థానంలో దళితుడైన తనను మున్సిపల్ చైర్మన్‌ను చేసిన ఘనత మంత్రి ఆర్కే రోజాకే దక్కుతుందన్నారు. కరోనాలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు. ఆర్కే రోజా ట్రస్టు ద్వారా రూ.1.50 కోట్లు ఖర్చు చేసి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేశారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ మాట్లాడుతూ మంత్రి రోజాకు రూ.లక్షలు ఇచ్చానని చెబుతున్న భువనేశ్వరి మూడేళ్లుగా ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. బాధితుడు వైఎస్సార్ సీపీ నేత సత్యం మాట్లాడుతూ తాను భూమి కొనుగోలు కోసం భువనేశ్వరి వద్ద రూ.29 లక్షలు తీసుకున్న మాట వాస్తవమన్నారు. ఇందులో రూ.13 లక్షలు తిరిగి ఇచ్చేశానని, రూ.16 లక్షలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. మంత్రి రోజా కుటుంబ సభ్యులను టార్గెట్ చేస్తూ చైర్మన్ పదవి కోసం ఇచ్చానని చెప్పడం దుర్మార్గమన్నారు. కౌన్సిలర్లు టి.ఏకాంబరం, చిట్టిబాబు, గుణ, మునిరత్నం, జేసీఎస్ కన్వీనర్ కె.ఏకాంబరం, ఈశ్వర్ యాదవ్, చక్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాయుడుపేట : పండ్లూరు మార్గంలోని స్వర్ణముఖి నర్సరీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. దొడ్డవనేని మదన్‌మోహన్‌నాయుడు(45) మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నాయుడుపేటలోని మెడికల్ షాపుల నిర్వాహకులు, వైద్యులను కలిసేందుకు నెల్లూరు నుంచి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మదన్‌మోహన్ నాయుడు మరణించాడు. ఎస్‌ఐ రఘునాథ్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేటకు చెందినవాడని ఎస్‌ఐ తెలిపారు.



మదన్‌మోహన్‌నాయుడు మృతదేహం

విద్యుదాఘాతంతో లైన్‌మన్...

సైదాపురం: మండలంలోని వేములచేడులో బుధవారం విద్యుదాఘాతానికి గురై లైన్‌మన్ మృతి చెందాడు. వివరాలు.. సైదాపురానికి చెందిన చెంజి శ్రీనివాసులు (42) విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం జరిగింది. తోటి ఉద్యోగుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు.



మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గణతంత్ర ఏర్పాట్లు పూర్తి

తిరుపతి(అలిపిరి): తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలో జనవరి 26న శుక్రవారం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరేడ్ గ్రౌండ్‌లో టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండాను ఎగురవేస్తారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు అందజేయనున్నారు. టీటీడీ విద్యాసంస్థల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు.

తప్పుడు ప్రచారం తగదు

తిరుపతి కల్చరల్: ఏపీ ఆర్యవైశ్య మహాసభ పేరుతో శుక్రవారం గుంటూరులో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం తగదని కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం పేరుతో సోషల్ మీడియాలో విడుదల చేసిన కరపత్రంలో పంగులూరి సీతమ్మ ట్రస్ట్ ఫౌండర్ అని ఉండడం మంచిది కాదన్నారు. తిరుపతిలోని కన్యకాపరమేశ్వరి ఆలయ పాలక వర్గం అనుబంధంగా పంగులూరి సీతమ్మ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సీతమ ట్రస్ట్ ఆస్తులను పరిరక్షిస్తున్నట్టు తెలిపారు. అదే ట్రస్ట్ ఫౌండర్ అంటూ కరపత్రాల్లో ప్రచారం చేయడం దారుణమన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంకు చెందిన 40 మంది టీడీపీ కార్యకర్తలు, యువకులు బుధవారం చెల్దిగానిపల్లి వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. కుప్పంలో భరత్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పార్టీలో చేరినవారిలో మహేష్, నరేంద్ర, మునిరాజ్, ముత్తు, భరత్, ఇంతియాజ్, నదీమ్, గణేష్, గోపి, శ్రీకాంత్, షంపేర్ ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, నాయకుడు మధుసూదన్ రెడ్డి, మండల యువత అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ జయప్ప, సిద్ధప్ప, మండల కో ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి సేవ చేసే భాగ్యాన్ని కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ జరగని అభివృద్ధిని చేసి చూపానని, మరింత సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డి బుధవారం తిరుపతి బైరాగిపట్టెడలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చాలామంది నాయకులు ఎన్నికల సమయంలో అవి చేస్తాం, ఇవి చేస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చాక పట్టించుకోరని తెలిపారు. తాను తిరుపతి నగరంలో చేసిన అభివృద్ధి చూసి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే తిరుపతిని ఐటీ హబ్‌గా తీర్చిదిద్ది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తిరుపతి నగరంలో నేరాలకు తావు లేకుండా క్రైం ఫ్రీ సిటీగా మారుస్తానని, అందుకోసం నగరంలోని ప్రతి వీధిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే తిరుపతి ప్రజల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించినట్టు తెలిపారు. కొర్లగుంట రోడ్డు విస్తరణతో స్థానికుల సమస్యలు తీరాయన్నారు. 20 ఏళ్లుగా పరిష్కారం కాని 22ఏను రద్దు చేసి సుమారు ఏడువేల మందికి లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుబాల, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, నాయకులు మహి, సురేష్ పాల్గొన్నారు.

చెవిరెడ్డి లక్ష్మికి గడప గడపలోనూ ఆత్మీయ స్వాగతం



చెవిరెడ్డి లక్ష్మికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి బుధవారం తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో చేపట్టిన రెండో రోజు పాదయాత్ర పండుగ వాతావరణంలో జరిగింది. ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ, మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా నియోజకవర్గ ప్రజలకు సేవలు అందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. సర్పంచ్ మునస్వామి లక్ష్మి, శివ, లక్ష్మీసెల్వం, రామచంద్రాపురం జెడ్పీటీసీ ఢిల్లీరాణి, భానుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు గోకులం ముస్తాబు

తిరుమల: తిరుమలలోని అదనపు ఈవో క్యాంపు కార్యాలయమైన గోకులం విశ్రాంతి భవనం గణతంత్ర దినోత్సవానికి ముస్తాబైంది. ఇక్కడ టీటీడీ గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు జాతీయ జెండాను ఎగురవేస్తారు. ముఖ్య అతిథిగా ఈవో ధర్మారెడ్డి పాల్గొని సందేశాన్ని ఇస్తారు.

రేపటి నుంచి తొండవాడలో ఉచిత కంటి చికిత్సలు

చంద్రగిరి: మండలంలోని తొండవాడ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నరసింగాపురం సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి తెలిపారు. ప్రవాస భారతీయుడు డాక్టర్ మల్లం మోహన్, పద్మ, చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి శుక్లాల చికిత్సలు చేస్తారని తెలిపారు. 29వ తేదీ నుంచి ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు.

గంగుడుపల్లిలో ఘనంగా గంగజాతర

చంద్రగిరి: మండలంలోని గంగుడుపల్లిలో బుధవారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి పూజలు చేశారు. బుధవారం అంబళ్లు సమర్పించారు. మధ్యాహ్నం కుంభాలు వేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

యువ టూరిజం క్లబ్ ప్రారంభం

తిరుపతి సిటీ: భారత ప్రభుత్వం పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జాతీయ సంస్కృత వర్సిటీలో బుధవారం యువ టూరిజం క్లబ్‌ను ప్రారంభించారు. దీనిద్వారా భారతదేశం హెరిటేజ్ కల్చర్, వారసత్వ సంపదపై యువకులకు అవగాహన కల్పించి భారత సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించనున్నట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా బాలికా దినోత్సవం

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఎస్.జయలక్ష్మి మాట్లాడుతూ బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. దిశా ఎస్ఐ శివాజీ మాట్లాడుతూ యుక్త వయసులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్‌పై విద్యార్థినులకు శిక్షణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో బుధవారం విద్యార్థినులకు ఉన్నత విద్యా మండలి బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ శిక్షణ ఇచ్చారు. ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, వీసీ డి.భారతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు సామాజిక సేవ చేయడంతోపాటు రెండు నెలలు ప్రైమరీ స్కూళ్లకు వెళ్లి 10 నుంచి 15 మంది పిల్లలను గుర్తించి వారికి విద్యను నేర్పించి ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపడతారు.

భాకరాపేట ఘాట్‌లో కారు బోల్తా

భాకరాపేట: భాకరాపేట ఘాట్‌లో బుధవారం సాయంత్రం కారు బోల్తా పడింది. తెలంగాణా రాష్ట్రం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రామాపురానికి చెందిన వెంకటేష్ కుటుంబం కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరింది. భాకరాపేట ఘాట్ మొదటి మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న 13 మంది సురక్షితంగా బయటపడ్డారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

రామచంద్రాపురం: రోడ్డు భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కుసుమ తెలిపారు. మండలంలోని వెంకట్రామాపురం సమీపంలో ఉన్న సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కరస్పాండెంట్ సుమలత పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై బాలికలకు అవగాహన ఉండాలి

తిరుపతి(అలిపిరి): బాలికలకు స్వీయ రక్షణపై అవగాహన తప్పనిసరని పద్మావతి మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రాణి తెలిపారు. స్థానిక బధిరుల బాలికల పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు స్వీయ రక్షణపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. టీటీడీ బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి మాట్లాడుతూ ఈ శిక్షణ ఈ నెల 28 వరకు ఉంటుందన్నారు. శిక్షకుడు ధనుంజయులు మాట్లాడుతూ కరాటేతో ఆడపిల్లలు స్వీయ రక్షణకే కాకుండా ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందే అవకాశం ఉందని వివరించారు.



